## అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలి




సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ మహేందర్‌గౌడ్

**బండ్లగూడ:** రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజా పాలన కార్యక్రమాన్ని అర్హులైన ప్రతి ఒక్కరు దరఖాస్తు చేసుకోవాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ అన్నారు. 18వ డివిజన్ శివాజీ యూత్ బిల్డింగ్ వద్ద ఏర్పాటు చేసిన వార్డు సభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరు ప్రజా పాలన కార్యక్రమంలో పాల్గొని దరఖాస్తులు అందించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలకు అర్హత సాధించాలంటే ఈ ప్రజా పాలనలో దరఖాస్తులు చేసుకోవడం ఎంతో ముఖ్యమన్నారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ శరత్‌చంద్ర, కార్పొరేటర్ శ్రీలతసురేష్‌గౌడ్, మేనేజర్ వేణుగోపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సురేష్‌గౌడ్, ఎస్ఈఈడి యాదయ్య, ఎలక్ట్రిక్ ఏఈ శ్రీనివాస్‌రెడ్డి, మెప్మా అధికారి శ్రీలత, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు అండగా ఉంటాం



విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్న రామకృష్ణారెడ్డి

**మణికొండ:** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు తాము అండగా ఉండి చేయూతనందిస్తామని బీఆర్ఎస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్ కె. రామకృష్ణారెడ్డి అన్నారు. మణికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉత్తమ ఫలితాలకు సాయంత్రం నిర్వహిస్తున్న అదనపు తరగతులో విద్యార్థులు హాజరవుతున్నారు. మధ్యాహ్నం భోజనం చేసి సాయంత్రం 6గంటల వరకు పాఠశాలలో ఉండటం ఇబ్బందిగా మారింది. దీంతో ఆయన స్పందించి సాయంత్రం సమయంలో విద్యార్థులకు అల్పాహారం అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం ప్రత్యేక తరగతులు పూర్తయ్యే వరకు కొనసాగిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు బి. శ్రీరాములు, కౌన్సిలర్ వసంతరావు, నాయకులు ఎ.కుమార్, గంగాధర్, ప్రధానోపాధ్యాయుడు నిరంజన్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇష్టానుసారంగా వ్యర్థాల పారబోత



మూసీ పరీవాహక ప్రాంతంలో పారబోసిన వ్యర్థాలు

**అత్తాపూర్:** గృహ నిర్మాణాల వ్యర్థాలు నిరుపయోగంగా ఉన్న వస్తువులు, చెత్తచెదారాలను మూసి పరివాహక ప్రాంతంలో కుప్పలు తెప్పలుగా వేస్తున్నారు. దీంతో మూసినది తీర ప్రాంతమంతా వ్యర్థాలతో నిండిపోతూ ఆక్రమణకు గురవుతుంది. అత్తాపూర్ పాత గ్రామ సరిహద్దు నుంచి మూసినది ప్రవహిస్తూ ఉంటుంది. అత్తాపూర్ పరిసర ప్రాంతాల్లో నూతనంగా నిర్మించుకునే గృహ నిర్మాణదారులు పురాతన ఇళ్ల వ్యర్థాలను మూసినదిలో డంపు చేస్తున్నారు. డంపు చేసిన ప్రాంతాలను ఆక్రమణదారులు చదును చేసి ఆయా ప్రాంతాలను ఆక్రమించుకునేందుకు ప్రయతిస్తున్నారు. గ్రామ సరిహద్దులను సూచిస్తూ మూసినది పరివాహక ప్రాంతంలో సూచిక బోర్డులను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. పరివాహక ప్రాంతాలు కబ్జాలకు గురి కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ఈ మేరకు సంబంధిత అధికారులు సరిహద్దుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిఘాను పెంచాలని స్థానికులు కోరుతున్నారు.

## ఆర్టీసీ కానిస్టేబుళ్లకు శిక్షణ ప్రారంభం



శిక్షణా కార్యక్రమానికి హాజరైన కానిస్టేబుళ్లు



మాట్లాడుతున్న ఆర్టీసీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ వి.రవీందర్

**గచ్చిబౌలి:** ఆర్టీసీ భద్రతలో కానిస్టేబుళ్ల విధులు కీలకంగా ఉంటాయని ఆర్టీసీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ వి.రవీందర్ పేర్కొన్నారు. బుధవారం కొండాపూర్‌లోని టీఎస్ఎస్‌పీ 8వ బెటాలియన్‌లో ఆర్టీసీ కానిస్టేబుళ్లకు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని కమాండెంట్ సన్నీతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ, అంకితభావంతో పని చేయాలని సూచించారు. కమాండెంట్ సన్నీ మాట్లాడుతూ శిక్షణలో విధుల పట్ల అవగాహన ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ సుబ్రహ్మణ్యం, రామకృష్ణ, శ్రీకాంత్, టీఎస్ఆర్టీసీ ఈడీ (అడ్మిన్) మహంకాళీ, డాక్టర్ జ్యోతిరావు పూలే, డి.నారాయణదాసు పాల్గొన్నారు.

### పాతబస్తీలో వైద్య సేవలను మరింత మెరుగుపరచాలి

**చార్మినార్:** పాతబస్తీలో వైద్య సేవలను మరింత మెరుగుపరచాల్సిన అవసరం ఉందని, దీనికోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన విషయాన్ని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదరం రాజనర్సింహ్మను కోరామని టీపీసీసీ మాజీ కార్యదర్శి కే.ఎస్.ఆనంద్‌రావు తెలిపారు. బుధవారం మంత్రిని ఆయన మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పాతబస్తీలో వైద్యసేవలు అంతంత మాత్రంగానే కొనసాగాయని విమర్శించారు. వీటిని తమ ప్రభుత్వం మెరుగుపరచాల్సిన అవసరం ఉందన్నారు.

### పెన్షన్ పేమెంట్ జేడీకి ఉద్యోగ సంఘాల వినతి

**నాంపల్లి:** పెన్షన్ పేమెంట్ జాయింట్ డైరెక్టర్ వసుంధరను తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం నేతలు కలిసి ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. కేంద్ర సంఘం కోశాధికారి ధన్‌రాజ్ నేతృత్వంలో పెన్షన్ పేమెంట్ ఉద్యోగుల యూనిట్ నేతలు బుధవారం నాంపల్లిలోని డైరెక్టర్ కార్యాలయంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. హైదరాబాద్ జిల్లా కార్యదర్శి సతీష్, యూనిట్ ఉపాధ్యక్షులు విజయలక్ష్మి, జేడీపీపీ యూనిట్ కోశాధికారి ధనుంజయ, జేడీ పీపీఓ యూనిట్ ఉపాధ్యక్షులు శివవర్ధన్ తదితరులున్నారు.

# సమయపాలన పాటించని రేషన్ షాపులు

- ఇబ్బందుల్లో వినియోగదారులు
- పట్టించుకోని అధికారులు




రేషన్ షాపు వద్ద ఏర్పాటు చేసిన పాత బోర్డు




మణికొండలో బుధవారం మూసి ఉన్న రేషన్ షాపు

**మణికొండ:** పేదలకు ప్రతి నెల రేషన్ బియ్యాన్ని సకాలంలో ఇవ్వాల్సిన రేషన్ షాపులు సమయ పాలన పాటించకపోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గండిపేట మండల పరిధిలోని రేషన్ షాపులు ఎప్పుడు తెరచుకుంటాయి, ఎప్పుడు మూత పడతాయో తెలియని పరిస్థితి నెలకొందని పలువురు వాపోతున్నారు. ప్రతి నెల సరుకులు తీసుకోవాలంటే అనేక సార్లు రేషన్ షాపుల చుట్టూ తిరగాల్సి వస్తుందని వినియోగదారులు పేర్కొన్నారు. రేషన్ షాపులు గతంలో ప్రతి నెల 1వ తేదీ నుంచి 15వ తేదీవరకు తెరచి ఉండి నిత్యావసరాలను అందించేవి. ఇటీవల ఆ సమయాన్ని కాస్త మార్పు చేశారు. ఆ విషయాన్ని షాపులకు వచ్చే వినియోగదారులకు తెలిసేలా బోర్డులు ఏర్పాటు చేయలేదు. బోర్డులపై తెలిపిన ఫోన్ నెంబర్‌లు ఎక్కువ సమయాల్లో స్విచ్ ఆఫ్‌గా వస్తున్నాయి. దాంతో లబ్ధి దారులు ప్రతి రోజు షాపుల వద్దకు ప్రదక్షిణలు చేయాల్సి వస్తుందని ప్రజలు పేర్కొంటున్నారు. గండిపేట మండల పరిధిలో గ్రామాలు, కాలనీలు విస్తరించటంతో రేషన్ షాపులకు వెళ్లాలంటే మూడు నుంచి పది కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తుంది. అలా వెళ్లిన వారికి తీరా అక్కడకు వెళ్లాక షాపు మూసి ఉండటంతో ఉసూరుమంటు తిరిగి ఇంటి దారి పడుతున్నారు. కనీసం షాపు ఎప్పుడు తెరుస్తారనే విషయం ఫోన్ చేసి కనుక్కుందామన్నా నెంబర్ స్విచ్ ఆఫ్‌గా వస్తుందని పలువురు వినియోగదారులు వాపోతున్నారు. ఇకనైనా అధికారులు సరైన చర్యలు తీసుకుని రేషన్ షాపు తెరిచే రోజులు, సమయాలను వివరిస్తూ సరైన బోర్డులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

### తేదీ మార్పు చేశారు

గతంలో రేషన్ షాపులకు నేలాఖరున సరుకులు వచ్చి 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ప్రజలకు ఇచ్చే వారు. దీనిని కాస్తా 5వ తేదీ నుంచి 22వ తేదీకి మార్చారు. దాంతో 1వ తేదీ నుంచి 5వ తేదీ మధ్యలో వచ్చే వారికి షాపు మూసి ఉండటంతో ఇబ్బందులు పడుతున్నారనే విషయం తమ దృష్టికి వచ్చింది. షాపుల వద్ద ఉన్న బోర్డులలో సమయం, తేదీలను పొందుపరిచేందుకు చర్యలు తీసుకుంటాం.

–విక్రంరెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్

## పథకాల అమలుకు వంద రోజులు వేచి చూద్దాం



దరఖాస్తులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

**శంషాబాద్ రూరల్:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుకు వంద రోజుల వరకు వేచి చూద్దాం.. అప్పటి వరకు ప్రభుత్వాన్ని విమర్శించాల్సిన అవసరం లేదని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్‌గౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని ననాజీపూర్‌లో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రజలకు మేలు చేస్తే స్వాగతిస్తామన్నారు. ఆరు గ్యారంటీల అమలుకు ఇంకా రెండు నెలల సమయం ఉందని.. అప్పటి వరకు వేచి చూద్దామన్నారు. అమలు చేయని పక్షంలో పోరాటం చేస్తామన్నారు. ప్రభుత్వంలో ఉన్నా లేకున్నా ప్రజల సంక్షేమం కోసం నాయకులు కృషి చేయాలన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉచిత కరెంటు, ఇంటింటికి నీళ్లు ఇచ్చామన్నారు. నన్ను ఆధరించి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నుకున్నారు.. ఇందుకు మీ పక్షాన నా బాధ్యతగా పోరాటం చేస్తామన్నారు. ఈ నెల 6వ తేదీ తర్వాత కూడా అభయహస్తం దరఖాస్తులు స్వీకరిస్తారని, ఎవరూ కూడా ఆందోళన చెందవద్దని అన్నారు. ఇదిలా ఉండగా.. గ్రామానికి ఆర్టీసీ బస్సు సర్వీసులను పెంచాలని స్థానికులు ఎమ్మెల్యేకు మొర పెట్టుకున్నారు. సరైన బస్సు సౌకర్యం లేక విద్యార్థులు, రైతులు, ప్రయివేటు ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విన్నవించారు. ఈ కార్యక్రమంలో సర్పంచు కల్పనసింహారెడ్డి, ఎంపీపీ జయమ్మ, జడ్పీటీసీ తన్వీ, వైస్ ఎంపీపీ నీలం, సొసైటీ చైర్మన్ సతీష్, ఎంపీడీఓ వసంతలక్ష్మీ, ఎంపీఓ ఉషాకిరణ్, ఏఓ కవిత, పంచాయతీ కార్యదర్శి రాధిక, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలనను వినియోగించుకోవాలి




మణికొండ పంచవటి కాలనీలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



నార్సింగిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న వైస్ చైర్మన్ వెంకటేశ్‌యాదవ్

**మణికొండ:** పేదలకు సంక్షేమ పథకాలను అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన పేరుతో ఏర్పాటు చేసిన దరఖాస్తు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి, నార్సింగి మున్సిపల్ వైస్ చైర్మన్ జి. వెంకటేష్‌యాదవ్, మణికొండ మున్సిపల్ కమిషనర్ కె. ఫల్గుణ్‌కుమార్‌లు అన్నారు. బుధవారం రెండు మున్సిపాలిటీలలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన దరఖాస్తు కేంద్రాలను వారు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ప్రజలు చేసుకున్న దరఖాస్తులను మానవతావాదంతో విచారణ చేసి వారికి పథకాలు అందేలా చూడాలన్నారు. మణికొండ మున్సిపాలిటీలో బుధవారం ఆరు గ్యారంటీలకు 814, ఇతర అవసరాలకు 465 మొత్తం 1279 దరఖాస్తులు వచ్చినట్టు కమిషనర్ ఫల్గుణ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో డీఈ దివ్యజ్యోతి, ఏఈ సాయిమానిక, నాయకులు ఎం. రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేతో సమావేశమైన కార్పొరేటర్



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న కార్పొరేటర్ అర్చన జయప్రకాశ్

**రాజేంద్రనగర్:** రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌తో బుధవారం రాజేంద్రనగర్ డివిజన్ పార్టీ కార్పొరేటర్ అర్చన జయప్రకాశ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, కొనసాగుతున్న పనులపై చర్చించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ అర్చన జయప్రకాశ్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలో కొనసాగుతున్న పనులపై ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారన్నారు. ఆయా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించినట్లు తెలిపారు. ప్రజలకు ఇబ్బంది కలుగకుండా ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షించాలని ఆదేశించారన్నారు. డివిజన్ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఎమ్మెల్యేతో చర్చించినట్లు ఆమె తెలిపారు.ఇందులో భాగంగా కోట్లాది రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో సూర్య ప్రకాశ్ రెడ్డి, జయప్రకాశ్ తదితరులు ఉన్నారు.

## దుర్భర జీవితాలు గడుపుతున్న గిరిజనులు



ప్రజలతో మాట్లాడుతున్న మణికొండ మున్సిపల్ చైర్మన్ నరేందర్ ముదిరాజ్

**అత్తాపూర్:** ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తీర్చేందుకు ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రజాపాలనలో ప్రజలను భాగస్వామ్యం చేయాలన్నదే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని మణికొండ మున్సిపల్ చైర్మన్ కస్తూరి నరేందర్ ముదిరాజ్ అన్నారు. రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మంగళవారం గోవర్ధన్ రెడ్డి, అత్తాపూర్ డివిజన్ అధ్యక్షులు కె. ప్రవీణ్ రెడ్డి, బి-బ్లాక్ అధ్యక్షులు ఖలీద్, రాజేంద్రనగర్ నియోజకవర్గం యువజన కాంగ్రెస్ అధ్యక్షులు కొండకళ్ల నాగేందర్ రెడ్డిలతో కలిసి ఆదివాసీ ఎస్టీ బస్తీలో శిథిలావస్థకు చేరిన గృహ నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కస్తూరి నరేందర్ మాట్లాడుతూ గత 30 సంవత్సరాల క్రితం స్థానిక సర్పంచ్ కొండకళ్ల కాంతారెడ్డి స్థానికంగా ఆదివాసి గిరిజనులకు ఇళ్లను మంజూరు చేయడం జరిగిందని వివరించారు. నేటి వరకు ఎలాంటి మౌలిక వసతులు లేకుండా దుర్భర జీవితం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీల కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రజా పాలనలో ప్రతి ఆదివాసి కుటుంబం దరఖాస్తు చేసుకొవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు భాస్కర్ గౌడ్ ముద్దగౌని, మహిళా అధ్యక్షురాలు రమాదేవి, రవీందర్ గౌడ్, జనార్దన్ రెడ్డి, వాణి, సునీత తదితరులు పాల్గొన్నారు.

### అమ్మవారి ఆలయంలో దొంగతనం

**శంషాబాద్ రూరల్:** పొలంలో ఉన్న ఆలయంలోని దేవతామూర్తి ఆభరణాలను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఇన్‌స్పెక్టర్ ఏ. శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బహదూర్‌గూడకు చెందిన ఏనుగు బుచ్చిరెడ్డి పొలంలో మైసమ్మ దేవాలయం ఉంది. ఈ ఆలయంలోని అమ్మవారి విగ్రహానికి ఆభరణాలు ఉన్నాయి. అయితే మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దేవతామూర్తిపై ఉన్న రెండు గ్రాముల బంగారం, 20 తులాల వెండి నగలు ఎత్తుకెళ్లారు. బుధవారం ఉదయం గమనించిన రైతు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నమన్నారు.

### తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

**శంషాబాద్ రూరల్:** రాత్రి వేళ ఇంటి తలుపులు విరగొట్టి బీరువాలోని బంగారు, వెండి నగలు దొంగిలించిన ఘటన ఊట్‌పల్లిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఏ. శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. శంషాబాద్ మున్సిపాలిటి పరిధిలోని ఊట్‌పల్లిలో నివాసముండే నవీన్‌కుమార్ ఈ నెల 2న కిస్మత్‌పూర్‌లోని అత్తగారింటికి వెళ్లాడు. ఇంట్లో ఉన్న ఇతని అన్న నర్సింహాచారి.. అదే రోజు రాత్రి ఇంటికి తాళం వేసి పైకప్పు అంతస్తులో ఉన్న తన బెడ్‌రూంలో నిద్రపోయాడు. ఉదయం వచ్చి చూడగా తలుపులు తెరిచి ఉన్నాయి. గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి బీరువాలో 2 తులాల బంగారం, 20 తులాల వెండి, కొంత నగదును దోచుకెళ్లారన్నారు. బుధవారం బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నమన్నారు.

### 'మనూ' దూరవిద్య కోర్సుల గడువు పెంపు

**రాయదుర్గం:** మనూలో దూరవిద్య కోర్సుల రిజిస్ట్రేషన్ గడువును పొడిగించడం జరిగిందని డైరెక్టరేట్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్(డీడీఈ) డైరెక్టర్ ప్రొఫెసర్ మహ్మద్ రజావుల్లాఖాన్ బుధవారం తెలిపారు. దూర విద్యాకోర్సులలో అండర్ గ్రాడ్యుయేట్, గ్రాడ్యుయేట్ కోర్సుల కోసం పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు జనవరి 10వ తేదీ వరకు అవకాశం ఉందని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. మరిన్ని వివరాలకోసం 'మనూ' వెబ్‌సైట్‌ను చూడాలని ఆయన కోరారు.

### డా. మహ్మద్ జావేద్ అలీకి జేసీబోస్ ఫెలోషిప్

**రాయదుర్గం:** ప్రతిష్టాత్మకమైన జేసీ బోస్ నేషనల్ ఫెలోషిప్-2023ని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ పూర్వ విద్యార్థి డాక్టర్ మహ్మద్ జావేద్ అలీ అందుకున్నారు. నగరంలోని ఎల్‌వి ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌లోని డాక్రియాలజీ హెడ్‌గా అలీ పనిచేస్తున్నారు. ఆయన హెచ్‌సీయూలో ప్రొఫెసర్ నడింపల్లి శివకుమార్ మార్గదర్శకత్వంలో బయోకెమిస్ట్రీ విభాగంలో 'హ్యూమన్ లాక్రిమల్ డ్రైనేజ్ సిస్టమ్ యొక్క గ్లైకోబయాలజీని అన్వేషించడం' అనే అంశంపై పీహెచ్‌డీ డిగ్రీని పొందారు. డాక్టర్ జావేద్‌అలీ అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన క్లినిషియన్-సైంటిస్ట్‌గా కొనసాగుతున్నాడు. ఆయనను పలువురు ప్రొఫెసర్లు అభినందించారు.

### రాష్ట్రంలో సుపరిపాలన

**గోల్కొండ :** సీఎం రేవంత్‌రెడ్డి సారధ్యంలో రాష్ట్రంలో సుపరిపాలన ప్రారంభమైందని కాంగ్రెస్ నాయకుడు మహ్మద్ అజహరుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన షేక్‌పేట్ డివిజన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజాపాలన కేంద్రాలను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అర్హులైన వారందరికీ తప్పకుండా కాంగ్రెస్ ఆరు హామీలలో ఏదో ఒకటి లభిస్తుందన్నారు. గత ప్రభుత్వం సంక్షేమ పథకాల పేరుతో ప్రజాధనాన్ని దోచుకుందని విమర్శించారు. సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకునేవారు దళారులను ఆశ్రయించకుండా నేరుగా తమకు కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వచ్చే ఐదేళ్లల్లో దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా రూపుదిద్దుకోవడం ఖాయమన్నారు. అనంతరం ఉద్యోగ కల్పన, పరిశ్రమల అభివృద్ధి తదితర విషయాలపై దృష్టిసారిస్తుందన్నారు.

## ప్రజా పాలనలో 20901 దరఖాస్తుల స్వీకరణ

**రాజేంద్రనగర్:** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని 5 డివిజన్లలో ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా 20,901 దరఖాస్తులను స్వీకరించినట్లు ఉప కమిషనర్ రవి కుమార్ తెలిపారు. రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, అత్తాపూర్, సులేమాన్‌నగర్, శాస్త్రిపురం డివిజన్లలో ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా అభయ హస్తం దరఖాస్తులను స్వీకరించేందుకు ప్రత్యేకంగా కౌంటర్లను ఏర్పాటు చేశామన్నారు. ఈ కౌంటర్ల ద్వారా దరఖాస్తులను ఉచితంగా అందించి వాటిని స్వీకరిస్తున్నామన్నారు. బుధవారం మొత్తం 20,901 దరఖాస్తులు అందాయన్నారు. ఇందులో అభయహస్తం పథకం కోసం 15,086 దరఖాస్తు చేసుకున్నారని వెల్లడించారు. మిగతా 5815 దరఖాస్తులను రేషన్ కార్డులతో పాటు ఇతర పథకాల కోసం ప్రజలు దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఈ నెల 6వ తేదీ వరకు ఈ దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతుందన్నారు. దరఖాస్తు కేంద్రాల వద్ద ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

## రాముని అక్షింతలు ప్రతి ఇంట్లో ఉండాలి



మణికొండలో శ్రీ రాముని అక్షింతలను పంపిణీ చేస్తున్న నాయకులు

**మణికొండ:** దశాబ్దాల తరువాత అంగరంగ వైభవంగా తన దేవాలయాన్ని అయోధ్యలో నిర్మింపజేసుకున్న శ్రీరాముని అక్షింతలు ప్రతి ఇంట్లో ఉంటే ఎంతో శుభమని వాటిని ప్రతి ఒక్కరు అడిగి తీసుకోవాలని బీజేపీ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు సి. బీరప్ప అన్నారు. బుధవారం మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీలలో ఆయన ఆధ్వర్యంలో అక్షింతల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి, అపార్ట్‌మెంట్‌కు అక్షింతలు అందించేందుకు తమ పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు రామ భక్తులు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. బి. శివకుమమార్, నర్సింగ్‌రావు, రవీందర్‌రెడ్డి, రవికాంత్‌రెడ్డి, వినోద్, ప్రసాద్, నవీన్‌కుమార్‌లు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వాముల శబరిమల యాత్ర



శబరిమలైకు బయలుదేరిన అయ్యప్ప స్వాములు

**రాజేంద్రనగర్:** బుద్వేల్ గ్రామంలోని శ్రీ కుసుమ హరనాథ బాబా మందిరం సభ్యులు అయ్యప్ప మాలాధారణతో బుధవారం శ్రీ శివాంజనేయ స్వామి దేవాలయం నుంచి ఇరుముడులు కట్టుకొని శబరిమలై యాత్రకు బయలుదేరారు. ఈ కార్యక్రమంలో దేవాలయం కమిటీ అధ్యక్షులు కె. శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షులు ఎస్.కె. నజీర్, బి. గోపాల్, అసోసియేట్ ప్రెసిడెంట్ పి. యాదగిరి గౌడ్, ఎండీ వాజిద్, ప్రధాన కార్యదర్శి జి. హరికిషన్ గౌడ్, సంయుక్త కార్యదర్శి డి. అరవింద్ కుమార్, ఎం. నిరంజన్ గౌడ్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు ఎం. రమేశ్ నాయిని, ఇబ్రహీం ఖాన్, ఎం. బాబురాజ్, జి. రవికిరణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సావిత్రీబాయి పూలే జయంతి



పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

**రాజేంద్రనగర్:** రాజేంద్రనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్దఉన్న సావిత్రీబాయి పూలే జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. జయంతోత్సవ కమిటీతో పాటు వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, వివిధ సంఘాలకు చెందిన నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై. శ్రీధర్, జిల్లా కార్యదర్శి ఎం. కొమరయ్య, కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా నాయకులు కోరని బాల్‌రాజ్, కోరని శ్యామ్, కె. నారాయణ ముదిరాజ్, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు రఘు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు నాణ్యతతో కట్టాలి



బృందావన్ కాలనీలో పర్యటించిన కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

**మైలార్‌దేవ్‌పల్లి:** డ్రైనేజీ పైపులైన్ పనులలో నాణ్యతాప్రమాణాలు పాటించాలని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని లక్ష్మిగూడ బృందావన్ కాలనీలో నిర్మిస్తున్న డ్రైనేజీ పైపులైన్ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. డ్రైనేజీ మ్యాన్‌హోల్‌లు తొందరగా కుంగిపోకుండా నాణ్యతతో కట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## సంపూర్ణ విద్య అందించే దిశగా కృషి చేయాలి

**రాయదుర్గం:** మూడేళ్ల కాలంలో 2023-24 నుంచి 2025-26 వరకు 15 లక్షల మంది ఫ్యాకల్టీ సభ్యులకు అవగాహ కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్- మాలవ్య మిషన్ టీచర్స్ ట్రైనింగ్ సెంటర్ (యూజీసీ-ఎంఎంటీటీసీ) డైరెక్టర్ ప్రొఫెసర్ ననీమ్ ఫాతిమా స్పష్టం చేశారు. గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో నూతన జాతీయ విద్యావిధానం-2020పై యూజీసీ-ఎంఎంటీటీసీ ఆధ్వర్యంలో 8 రోజులపాటు నిర్వహించే అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ సంపూర్ణ విద్యను అందించడం, భారతదేశం-కేంద్రీకృత నైతికత, విలువల యొక్క ఆదర్శాలను గ్రహించడం, కొత్త బోధనా పద్ధతులను రూపొందించడం, విమర్శనాత్మక ఆలోచనను అభివృద్ధి చేయడం, అభ్యాస ప్రక్రియలో ఐసీటీ సాధనాలను ఏకీకృతం చేసే సామర్థ్యాన్ని అభివృద్ధి చేయడంపై అవగాహన కల్పిస్తారన్నారు. ఈ కార్యక్రమం జనవరి 11వ తేదీతో ముగుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలు విద్యాసంస్థలకు చెందిన ఫ్యాకల్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.